సాగు.. నిర్వీర్యం

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర ఇక్కట్లు
- మరమ్మతులకు నోచుకోని ప్రాజెక్టులు, కాలువలు
- ఐదేళ్లుగా వర్షాలపైనే ఆధారం
- కూటమి అధికారంలోకి రావడంతో చిగురిస్తున్న ఆశలు



నరసన్నపేట శివారులో అధ్వానంగా వంశధార కాలువ

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీటి ప్రాజెక్టులు నిరుపయోగంగా మారాయి. జిల్లాలో వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ నదులు, వాటి కాలువలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. గత ఐదేళ్లూ సక్రమంగా సాగునీరు అందక అన్నదాతలు విలవిల్లాడారు. వర్షాలపైనే ఆధారపడి సాగు చేశారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చేలా సీఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నాయుడుకే వ్యవసాయశాఖ కేటాయించడంతో ఇకపై తమకు సాగునీటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు.

(నరసన్నపేట)

వైసీపీ పాలనలో అన్నదాతలు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వం వంశధార, నాగావళి, ఆఫ్‌షోర్ వంటి ప్రాజెక్టులను గాలికొదిలేసింది. కాలువల ను కూడా కనీస స్థాయిలో పట్టించుకోకపోవడం.. రైతుల కు శాపంగా మారింది. వంశధార ఎడమ కాలువ, అను బంధ కాలువల్లో ఎక్కడికక్కడ సిల్ట్, గుర్రపుడెక్క పేరుకు పోవడంతో శివారుప్రాంతాలకు సాగునీరు అందని దుస్థితి నెలకొంది. జిల్లాలో వంశధార ద్వారా 2.08 లక్షల ఎకరాల కు సాగునీరందేది. ఎడమ కాలువ ద్వారా హిరమండలం, సారవకోట, జలుమూరు, నరసన్నపేట, పోలాకి, సంత బొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో 104 కిలోమీటర్ల వరకు కాలువల ద్వారా 1.48 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. గత ఐదేళ్ల లో కాలువలను పట్టించుకోకపోవడంతో శివారు ప్రాంతా లైన పోలాకి, కోటబొమ్మాళి, టెక్కలి, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలకు సాగునీరు అందలేదు. నదీ తీరం పక్కనే ఉన్నా జలుమూరు, నరసన్నపేట, పోలాకి మండలాల్లో కూడా కాలువల ద్వారా సాగునీరు అందక ఏటా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- వంశధార కుడి కాలువ ద్వారా జలుమూరు, ఎల్.ఎన్.పేట, నరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో 60 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఆర్ఎంసీ కాలువల్లో సిల్ట్, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో శివారు ప్రాంతాలకు సాగునీరందక రైతులు వర్షాలపైనే ఆధారపడ్డారు.
- నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆయకట్టు ద్వారా ఆమదాలవలస, పొందూరు, బూర్జ, ఎచ్చెర్ల, లావేరు మండలాలకు సాగునీరు అందుతుంది. ఈ కాలువల్లో కూడా పనులు చేపట్టక.. ఎచ్చెర్ల, లావేరు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈప్రాంత రైతులు ఆరుతడి పంటలపై మొగ్గు చూపుతున్నారు. ఇక ఉద్దానంలో మహేంద్రతనయ, ఆఫ్‌షోర్ ప్రాజెక్టుల పనుల్లో కదలిక లేక.. రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- రెండేళ్ల కిందట కేటగిరి-బీ కింద నరసన్నపేట డివిజన్ పరిధిలోని వంశధార కాలువలో రూ.3 కోట్లతో మట్టి తీతపనులు చేపట్టారు. కానీ కాంట్రాక్టర్‌కు ఇప్పటికీ నిధులు చెల్లించలేదు. దీంతో పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకురాని దుస్థితి నెలకొంది.

కూటమిపైనే ఆశలు..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల జిల్లాకు టీడీపీ అధినేత చంద్రబాబు వచ్చినప్పుడు.. నదుల అనుసంధానమే ధ్యేయమని, ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తామని ప్రకటించారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సీఎం చంద్రబాబు సారథ్యంలో సాగునీటి వనరులకు మహర్దశ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించి.. సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు త్వరలో నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించి.. ప్రణాళిక రూపొందించనున్నారు. వచ్చే నెల రెండో వారంలో కాలువల్లోకి సాగునీటికి విడిచిపెట్టేందుకు సిద్ధమవుతున్నారు.



జమ్ము వద్ద షట్టర్లు లేని వంశధార కాలువ

పనులు శూన్యం..



గత ఐదేళ్లుగా కాలువలను బాగు చేయాలని ఇరిగేషన్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నాం. కానీ ఇంతవరకు పనులు చేయలేదు. ఏటా సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. కనీసం గుర్రపు డెక్క అయినా తొలగించాలి.

-వాన గోవిందరాజులు, సర్పంచ్, జమ్ము


కాలువల అభివృద్ధి మరిచారు..



ఏటా శిస్తు వసూళ్లు చేస్తున్నారు.. కాలువల్లో పిడికెడు మట్టి అయినా తీయడం లేదు. పంట చేతికి వచ్చిన సమయంలో సాగునీరు అందక దిగుబడి తగ్గుతోంది. కాలువలను బాగు చేయాలి.

-జల్లు చంద్రమౌళి, లాండ్ లార్డ్, ఉర్లాం

పంట నష్టపోయాం..



గత ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేశారు. సాగునీటి కోసం పడరాని పాట్లు పడ్డాం. శివారు భూములకు నీరు అందక పంట నష్టపోయాం.

-శిమ్మ చంద్రశేఖర్ , రైతు, మాకివలస

సాగునీటికి ప్రాధాన్యమిస్తాం..



సీఎం చంద్రబాబు రైతులను ఆదుకునేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రతీ ఏకరాకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. వంశధార కాలువలు ప్రక్షాళన చేస్తాం.

-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

నిధులు లేక.. పనులు జరగలేదు..

నరసన్నపేట డివిజన్ పరిధిలోని వంశధార కాలువల్లో గత ఐదేళ్లలో నిధులు లేక పనులు చేపట్టలేదు. రెండేళ్ల కిందట రైతులు చెల్లించిన భూమిశిస్తు వాటాతో కేటగిరి ఏ పద్దులో కొన్ని పనులు చేసినా బిల్లులు చెల్లించలేదు. ఎల్ఎంసీ ఆధునికీకరణకు రూ.950కోట్లతో ఎస్ఈ నేతృత్వంలో ప్రతిపాదనలు పంపించాం.

-ప్రదీప్ కుమార్, ఈఈ, వంశధార.

రేపటి నుంచి 'మీ కోసం'

- ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

కలెక్టరేట్, జూన్ 22: 'మీ కోసం' పేరుతో ఈ నెల 24 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. ఇకపై ప్రతీ ఫిర్యాదును మీ కోసం కార్యక్రమంలో స్వీకరించి.. సత్వర పరిష్కారం చేపడతామన్నారు. ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- వారం రోజుల్లో కాలువలు శుభ్రం చేయాలి
- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, జూన్ 22: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. అలాగే తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డయేరియా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. కాలువలను వారం రోజుల్లో శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. డయేరియా నివారణకు అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, స్కానింగ్ సెంటర్ల పనితీరు, స్కూల్‌హెల్త్ తదితర కార్యక్రమాలపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డయేరియా కేసును గుర్తించిన వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులకు సమాచారం చేరవేసి, సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

- డీఎంహెచ్‌వో మీనాక్షి మాట్లాడుతూ.. 'జిల్లాలో డయేరియా నివారణకు చర్యలు చేపడుతున్నాం. సిబ్బంది, అంగన్‌వాడీల సమన్వయంతో ఇంటింటా సర్వే చేస్తున్నామ'ని తెలిపారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులను ఆదేశించారు. మంచినీటి శాంపిల్స్ పరీక్షించాలని సూచించారు. బయొలాజికల్ కంటామినేషన్ జరిగితే వెంటనే ఆ నీరు తాగకుండా నిలుపుదల చేయాలని తెలిపారు.
- జిల్లా పంచాయతీ అధికారి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులుగా ప్రత్యేక డ్రైవ్‌లో పారిశుధ్య పనులు చేపడుతున్నామని తెలిపారు. 'నీళ్ల ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలి. చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలి' అని సిబ్బందిని డీపీవో ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డీఐవో రాజేశ్వరి, ఉప వైద్యారోగ్యశాఖాధికారి ప్రసాదరావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డాక్టర్ సుజాత, డా.ప్రకాశరావు, డీఎంవో సత్యనారాయణ, జిల్లా ప్రోగ్రాం అధికారి వెంకటరత్నం, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా బదిలీ

- ప్రకాశం కలెక్టర్‌గా నియామకం



తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం అర్బన్, జూన్ 22: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా ప్రకాశం కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఐఏఎస్‌ల స్థానచలనంలో భాగంగా.. కమిషనర్ తమీమ్ అన్సారియాను బదిలీ చేశారు. ఈమె ప్రస్తుత కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ భార్య. ఈ ఏడాది ఫిబ్రవరి 1న శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. సీనియార్టీ ఆధారంగా ఆమెను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఆమె స్థానంలో ఇక్కడ ఇంకా ఎవరినీ నియమించలేదు.



పెంటూరులో వేంకటేశ్వరుడి కల్యాణం

కల్యాణం.. కమనీయం

- పెంటూరులో మార్మోగిన గోవిందనామస్మరణ

నందిగాం, జూన్ 22: నందిగాం మండలం పెంటూరులో శనివారం గోవింద నామస్మరణ మార్మోగింది. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీనివాస కల్యాణం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వేంకటేశ్వరుడి కల్యాణం కమనీయంగా సాగింది. వేలాదిమంది భక్తుల కోలాహలం, వేదపండితుల మంత్రోచ్చరణ, మేళతాళాలు మధ్య ఈ వేడుక నిర్వహించారు. ఉదయం శ్రీనివాస రథానికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికి ఉత్సవమూర్తులకు హారతులిచ్చారు. టీటీడీకి చెందిన ప్రధాన వేదపండితులు బాలాజీ, ఇతర అర్చక బృందం నేతృత్వంలో పూజలు చేశారు. అన్నమాచార్య కీర్తనలు, హరికథా గానాలు ఆలపించారు. కార్యక్రమంలో పెంటూరు వెంకటేశ్వర ఆలయ ధర్మకర్తలు బొడ్డ నారాయణరావు, జనార్దనరావు, కృష్ణారావు, రైస్‌మిల్లరు ప్రతినిధి ఏపీపీఆర్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.




వేంకటేశ్వరుడి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కుక్కల దాడిలో 20 మేకపిల్లలు మృతి

పాతపట్నం, జూన్ 22: కొరసవాడ గ్రామంలో శనివారం సాయంత్రం కుక్కల దాడిలో 20మేకపిల్లలు మృత్యువాతపడ్డాయి. వివరాలిలా ఉన్నాయి. కొరసవాడ సచివాలయానికి సమీపంలో పైసక్క చిన్నయ్యకి చెందిన మేకల శాలలో కుక్కలు దెబ్బలాడుకుంటూ మేకపిల్లలపై పడ్డాయి. బెదిరిన మేకపిల్లలు చెదిరిపోగా కుక్కలు వాటిపై దాడికి దిగాయి. దీంతో 20 మేకపిల్లలు మృతి చెందాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. స్థానికులు అక్కడికి చేరుకుని కుక్కలను చెదరగొట్టగా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకుని.. పశువైద్యాధికారి పి.అనిల్ ఘటనా ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. మేకపిల్లలు మృతిచెందినట్టు నిర్ధారించారు. శవపరీక్ష చేసి నష్టపరిహారం నిమిత్తం తహసీల్దార్‌కు నివేదించినట్లు ఆయన తెలిపారు.



మేక పిల్లలను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి అనిల్



ఏఎన్‌యూలో దూరవిద్య కోర్సులు

దిక్సూచి DIKSUCHI



గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) దూరవిద్య విభాగం- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఈ కోర్సులను ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో నిర్వహిస్తారు.

డిగ్రీ: బీఏ, బీకాం, బీబీఏ ప్రోగ్రామ్‌ల వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

బీఏ సబ్జెక్టులు: ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్.

బీకాం సబ్జెక్టులు: జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్

- బీబీఏ, బీఎల్ఐఎస్సీ, బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. బీఏ(ఎకనామిక్స్, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(జనరల్) కోర్సులను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో చదువుకోవచ్చు. మిగిలిన బీఏ కోర్సులు తెలుగు మాధ్యమంలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ/ఇంటర్ ఒకేషనల్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎల్ఐఎస్సీ కోర్సుకు మాత్రం ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

పీజీ: ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సుల వ్యవధి రెండేళ్లు. మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్.

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

- ఎంఏ కోర్సుల్లో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లను ఆ మాధ్యమంలోనే చదవాలి. ఎంఏ(ఎకనామిక్స్/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ) కోర్సులు తెలుగు మాధ్యమంలో ఉన్నాయి. మిగిలిన కోర్సులను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి.

అర్హత: ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సులకు ఏదేని డిగ్రీ; ఎంఏ(ఎకనామిక్స్)కు బీఏ(ఎకనామిక్స్); ఎంకాం కోర్సుకు బీకాం/బీబీఏ; ఎంఎల్ఐఎస్సీ కోర్సుకు బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏలో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

డిప్లొమా: ఈ కోర్సుల్లో ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫుడ్ ప్రొడక్షన్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, సైకలాజికల్ గైడెన్స్ కోర్సుకు ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్సులు: హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్, హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్ కోర్సులు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి. హౌస్ కీపింగ్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, ఎయిడ్స్ కౌన్సెలింగ్‌కు ఇంటర్(పారామెడికల్)తోపాటు ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.anucde.info

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/MQRZNeDలో చదవండి.

విశాఖ ఐఐపీఈలో బీటెక్

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ తోపాటు డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి క్యాట్ స్కోర్ లేకుండానే ఐఐఎం విశాఖపట్నంలో ఎంబీఏ చదివే వీలుంది.

విభాగాలు-సీట్లు: పెట్రోలియం ఇంజనీరింగ్‌లో 62 సీట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో 63 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 40 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 65 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **అకడమిక్ సెషన్ ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** iipe.ac.in

ఓయూలో లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

అర్హత: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం /సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్ఐ/సీఎస్ఎం/సీఎస్ఎన్/సీఎస్ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీఐసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 11
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 18
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 21
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 27
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 3
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

విజువల్‌గా.. మ్యూజికల్‌గా...



నాగచైతన్య, సాయి పల్లవి జంటగా రూపుదిద్దుకుంటున్న 'తండేల్' చిత్రం వైజాగ్, శ్రీకాకుళం షెడ్యూల్ శనివారంతో పూర్తయింది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ షెడ్యూల్‌లో హీరోహీరోయిన్లతో పాటు ఇతర నటీనటులు పాల్గొనగా కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. పాత్రల గెటప్, కాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్, యాస ప్రామాణికంగా ఉండేలా దర్శకుడు చందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాస్తవ సంఘటనల ప్రేరణతో ఓ ప్రేమ కథగా 'తండేల్' ను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. విజువల్‌గా, మ్యూజికల్‌గా ఎంతో అద్భుతంగా ఉండేలా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: షామ్‌దత్, ఎడిటింగ్: నవీన్ నూలి.

రామానుజుల గొప్పతనం చెప్పే కథ



డా. సాయి వెంకట్ టైటిల్ రోల్‌లో నటించి.. దర్శకత్వం వహించిన సినిమా 'జయహో రామానుజ'. జో శర్మ, సుమన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా వస్తున్న ఈ సినిమా ఫస్ట్ పార్ట్ జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'జయహో రామానుజ' సినిమా పాటలను చిత్ర బృందం శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు, హీరో సాయి వెంకట్ మాట్లాడుతూ 'మహిళల్ని గౌరవించాలని.. కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో మానవాళి కలసి ఉండాలని సందేశాన్ని ఇచ్చిన గొప్ప గురువు భగవత్ శ్రీ రామానుజాచార్యులు. ఆయన గొప్పదనం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందించాను' అని చెప్పారు. నిర్మాత ప్రవల్లిక మాట్లాడుతూ 'భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మించిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్, దర్శకుడు వీరశంకర్ పాల్గొన్నారు.

ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ



హాస్య నటుడు అలీ ఫ్యామిలీ నుంచి వచ్చిన సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పి.ఎల్. విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గోదావరి అందాలు, నేచురల్ లోకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రంలోని 'కలలో .. కలలో' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు కోటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే చక్కని అనుభూతి కలుగుతోంది. సాహిత్యం, సంగీతం, హీరోహీరోయిన్ల అభినయం చక్కగా కుదిరాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే పాట అవుతుంది' అన్నారు. 'ఇది ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానం అందంగా చూపించే ప్రయత్నం చేశాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల చేస్తాం' అని తెలిపారు దర్శకనిర్మాతలు. సునీల్ రావినూతల, పృథ్వీ, సాయికుమార్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో...



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది. ఈ సినిమాలోని ఓ పాటకు 'వార్', 'పఠాన్' సినిమాల ఫేమ్.. ప్రముఖ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిస్ నృత్యరీతుల్ని సమకూరుస్తున్నారు. థాయిలాండ్‌లో ప్రస్తుతం ఆ పాట షూటింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో తీసుకున్న ఫొటోను ఆయన షేర్ చేస్తూ.. "అత్యద్భుతమైన ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో పనిచేయడం ఎంతో ఆనందాన్నిస్తోంది" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

కల్కి ప్రత్యేక షో, టికెట్ ధరల పెంపునకు అనుమతి



ప్రభాస్ హీరోగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం ప్రత్యేక ప్రదర్శన, టికెట్ ధరల పెంపునకు అనుమతినిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈనెల 27వ తేదీన చిత్రం విడుదల కానుంది. జూలై 4వ తేదీ దాకా 8 రోజుల పాటు ప్రతీరోజూ ఐదు షోలు ప్రదర్శించటానికి అవకాశం ఇచ్చారు. విడుదల రోజు ఉదయం 5:30 గంటలకు ప్రత్యేక ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ రోజు మొత్తం ఆరు షోలు ప్రదర్శించనున్నారు. ఇక టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ.200లకు పెంచుకోవడానికి అనుమతించారు. సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న టికెట్ ధరపై రూ.75, మల్టీప్లెక్స్‌లలో రూ.100 అదనంగా పెంచుకోవడానికి అనుమతిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జితేందర్ శనివారం మెమోనెం.23424/జనరల్.ఏ1/2024ను జారీ చేశారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

లక్కు..నీ వెంట ...



'నా పేరు శివ', 'అంధగారం' వంటి చిత్రాల్లో నటించిన వినోద్ కిషన్ ప్రస్తుతం 'పేక మేడలు' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. అనూష కృష్ణ హీరోయిన్. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం భార్గవ్ కార్తీక్ రాసిన 'లక్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చరో లచ్చన్న' అంటూ సాగే పాటను విడుదల చేశారు. నాగూర్ బాబు ఈ పాట పాడారు. స్మరణ్ సాయి సంగీత దర్శకుడు. ఈ సినిమాను జులైలో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు.

భార్యా పిల్లల అదృశ్యంపై ఫిర్యాదు


రాములమ్మ

ఇచ్ఛాపురం: డొంకూరు గ్రామానికి చెందిన చీకటి రాములమ్మతోపాటు తన ఇద్దరు కుమార్తెలు అదృశ్యమైనట్టు రాములమ్మ భర్త చీకటి చంద్రయ్య శనివారం ఫిర్యాదు చేశారని రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. డొంకూరుకు చెందిన చంద్రయ్యకు తొమ్మిదేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన రాములమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలున్నారు. తల్లిదండ్రులతో పాటు భార్య పిల్లలు కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఈనెల 13న ఉదయం చంద్రయ్య చేపలు వేటకు వెళ్లగా తల్లి, తండ్రి కూలి పనికి వెళ్లారు. వారు పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య, పిల్లలు కనిపించలేదని ఫోన్ ద్వారా చంద్రయ్యకు అతడి తల్లిదండ్రులు సమాచారం ఇచ్చారు. వెంటనే బంధువుల సాయంతో చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా వారి ఆచూకీ లభించలేదు. ఇప్పటికీ వారు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

లావేరు: చినమురపాక గ్రామానికి చెందిన సిరిపురపు నాగమణి (35) తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివవరాల మేరకు.. గురువారం సాయంత్రం నాగమణి ఆమె భర్త ఎల్లయ్యల మధ్య చినపాటి గొడవ చోటు చేసుకుంది. దీంతో ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు తలుపులు విరగొట్టి కొన ఊపిరితో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. దీంతో నాగమణి తండ్రి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నైలో రైలు నుంచి జారిపడి మత్స్యకారుడి మృతి


సోమేష్ (ఫైల్)

సంతబొమ్మాళి: జీవనోపాధి నిమిత్తం చెన్నై వలస వెళ్లిన భావనపాడు గ్రామానికి చెందిన మత్స్యకారుడు కోయి రి సోమేష్ (47) ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సోమేష గత కొంతకాలంగా చెన్నైలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. విజయవాడలో కనక దుర్గ అమ్మ వారి దర్శనం కోసం ఈనెల 21 శుక్రవారం ఉదయం పెరంబూర్ రైల్వే స్టేషన్ నుంచి బయలు దేరాడు. అయితే విజయవాడ వెళ్లాల్సిన రైలు కాకుండా బెంగళూరు వైపు వెళ్లే రైలు ఎక్కి గంట పాటు ప్రయాణం చేసి తిరువళ్లూరు రైల్వే స్టేషన్‌లో దిగారు. అక్కడి నుంచి చెన్నై సెంట్రల్ కు లోకల్ రైలులో తిరుగు ప్రయాణం సాగిస్తుం డగా ప్రమా దవశాత్తు రైలు నుంచి జారి పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడి సెల్ ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు సింహా చలం ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహం తన అన్నదేనని నిర్ధారించారు. మృతుడికి భార్య గురమ్మ, ఒక కుమారుడు ఉన్నారు. అక్కడి రైల్వే పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వకంగా మెలగాలి: ఎస్పీ


అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ రాధిక

బూర్జ: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాద పూర్వకంగా మెలగాలని ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. శనివారం బూర్జ పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. అనధికారమైన కేసు ప్రాపర్టీని స్టేషన్‌లో ఉంచకుండా కోర్టు ఉత్తర్వులు మేరకు డిస్పోజబుల్ చేయాలని సూచించారు. సారా, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు, క్రయ విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టాలని, మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళిక మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమదాలవలస సీఐ దివాకర్, బూర్జ ఎస్ఐ ఉన్నారు.

వంశధార కాలువలో పూడికతీత


పూడికతీత పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

కుసుమపోలవలస(పోలాకి): మండల పరిధిలోని వంశధార సాగునీటి కాలువలో పేరుకు పోయిన పూడికను సంబంధిత అధికారులు తొలగించే చర్యలు చేపట్టారు. వంశధార కాలువ 16 ఆర్ఆర్ కాలువ నుంచి మాకివలస, కుసుమపోలవలస వరకు పిచ్చి మొక్కలతో, సిల్ట్ పేరుకుపోయి ఉందని, దీనిని తొలగించి సాగునీరందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి ఆదేశాల మేరకు సంబంధిత పనులు అధికారులు చేపట్టినట్లు కుసుమపోలవలస సర్పంచ్ తర్ర లక్ష్మీనారాయణ, టీడీపీ యువజన విభాగ నాయకుడు కె. రాంబాబు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత వంశధార అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సత్వరం కాలువ పనులు చేపట్టాలని ఆదేశించార న్నారు. శనివారం పనులను ప్రారంభించారని తెలిపారు.

స్వచ్ఛందంగా బావిని బాగు చేసిన యువత

పోలాకి: దీర్ఘాశి దుర్గానగర్ కాలనీ లోని భవానీ దుర్గాగిరి అమ్మవారి ఆలయం వద్ద పాడైన నంద బావిని స్థానిక యువకులు పూడిక తీసి మరమ్మతులు చేపట్టారు. అలాగే ఆలయ పరిసరాల్లోని ముళ్ల పొదలను, చెత్త చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా యువతను ఆలయ కమిటీ ప్రతినిధులు అభినందించారు.

విద్యా కిట్లు పంపిణీ

బూర్జ: ఓవీపేట ఆదర్శ పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ పీరకట్ల విశ్వ ప్రసాదరావు కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువు కొని పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆనెపు రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు హనుమంతు గోపి, ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కేంద్ర మంత్రి రామ్మోహన్


సీఎం చంద్రబాబుకు నమస్కరిస్తున్న రామ్మోహన్ నాయుడు, కలిశెట్టి అప్పలనాయుడు

శ్రీకాకుళం అర్బన్: ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడును శనివారం విజయ వాడలో కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అలాగే విజయ నగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడుతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు చంద్రబాబును కలిసి అభినందించారు.

జాతీయస్థాయి హోదా పునరుద్ధరించండి

శ్రీకాకుళం స్పోర్ట్స్: బాల్ బాడ్మింటన్ ఆటకు జాతీయస్థాయి హోదా పునరుద్ధరణకు పార్లమెంట్‌లో క్రీడాకారుల తరఫున గళం వినిపించాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీజీ కృష్ణంరాజు కోరారు. శనివారం విజయవాడలోని మంత్రి అచ్చెన్నాయుడు నివాసంలో కేంద్రమంత్రిని కృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయస్థాయిలో ప్రతిభను కనబర్చిన వందలాది మంది క్రీడాకారుల భవిష్యత్ హోదా పునరుద్ధరణ అంశంతో ముడిపడి ఉందని, ఈ విషయంలో న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి, శిక్షకులు ఎం.మధుసూదన్ రావు, మక్క రమేష్, మజ్జి చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

శ్రీకాకుళం క్రైం: ఓ బాధితురాలికి రక్షణ కల్పించేందుకు వెళ్లిన హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఘటన.. సిక్కోలులో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఎస్సీ వీధికి చెందిన ఓ వివాహిత.. తన భర్త ఎచ్చెర్ల గణేష్ వేధిస్తున్నాడని, తనకు రక్షణ కల్పించాలని 'డయల్ 100' ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో హెచ్‌సీ నాగరాజుపై గణేష్ దాడికి పాల్పడ్డాడు. అయినప్పటికీ ఆమెకు హెచ్‌సీ రక్షణగా నిలిచారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కాగా.. ఇటీవల రెండవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో హెచ్‌సీపై దాడి ఘటన మరువక ముందే.. మరో సంఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది.

దాడి ఘటనపై దర్యాప్తు ముమ్మరం

శ్రీకాకుళం క్రైం: ఎచ్చెర్ల మండలం నవభారత్ జంక్షన్‌లో నివసిస్తున్న ఓ మహిళను చిత్రహింసలకు గురిచేసి చితక బాది, నడివీధిలో ఊరేగించిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. జిల్లాలో సంచలనం రేపిన ఈ కేసులో ఐదుగురు నిందితులను ఎచ్చెర్ల పోలీసులు అరెస్టు చేయగా.. ఒకరు పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎచ్చెర్ల ఎస్ఐ చిరంజీవి ఘటన జరిగిన శ్రీకాకుళం నగర పరిధిలోని దమ్మల వీధిలో విచారణ చేపట్టారు. ఆ వీధిలో బాధితురాలు మంగును అల్లిపిల్లి రాధ, కోడ భవాని, కుందు జయ, అల్లి పిల్లి నీలిమ, మైలపల్లి కృష్ణవేణిలతో పాటు మరో ఇద్దరు కొట్టి, బట్టలు విప్పి ఊరేగించారని ప్రత్యక్ష సాక్షులు పోలీ సులకు వాంగ్మూలం ఇచ్చారు. ఈ ఘటనలో రాధ కుమారుడు శ్రీకాంత్ పాత్ర ఉన్నట్టు గుర్తించారు. బాధితురాలిని కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన ఎచ్చెర్ల పోలీసులకు తనకు న్యాయం చేయాలని కోరింది. ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ.. ఎస్పీ రాధిక పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే మిగిలిన నిందితుడిని అరెస్ట్ చేస్తామన్నారు. బాధితురాలికి న్యాయం చేస్తామన్నారు.

కేవీకేకు చేరిన టార్చ్ రిలే


కేవీకేలో టార్చ్‌ను చూపుతున్న దృశ్యం

ఆమదాలవలస: దేశంలో మొట్టమొదటి కృషి విజ్ఞాన కేంద్రం పాండిచ్చేరిలో 1974 సంవత్సరంలో ప్రారంభించారు. ఇప్పటికి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల భారత వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ కేవీకే పాండిచ్చేరిలో జ్యోతి టార్చ్ రిలేను మార్చి 31వ తేదీన ప్రారంభించారు. ఈ టార్చ్ రిలే ప్రతి కేవీకేకు చేరుతూ ఆమదాలవలసకు శనివారం చేరిందని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ టార్చ్ రిలే కేవీకే శాస్త్రవేత్తల బృందం వ్యవసాయ రంగంలో అందించిన సేవలకు ప్రతీకగా 11 ఆటారి జోన్లను కలుపుకొని ఢిల్లీ చేరనుందని తెలిపారు. రస్తకుంటబాయి నుంచి టార్చ్ ఆమదాలవలస చేరుకుందని, ఇక్కడి నుంచి కొండంపూడి కేవీకే అందించనున్నట్టు తెలిపారు.

భవనాన్ని అప్పగించండి

బీసీకాలనీ (పోలాకి): స్థానిక బీసీ కాలనీలో యార్డ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన భవనాన్ని తమకు అప్పగించాలని స్వయంశక్తి సంఘాల మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సంబంధిత భవనం వద్ద నిరసన తెలిపారు. సదరు భవనాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది చట్ట విరుద్ధమని స్వయంశక్తి సంఘాల నాయకులు త్రినాథమ్మ, పోతల లక్ష్మి, రమణమ్మ, వెంకటలక్ష్మి, జయమ్మ తదితరులు పేర్కొన్నారు. ఈ భవ నంలో గతంలో కుట్లు, అల్లికలకు శిక్షణతో పాటు సమావేశాలు నిర్వహించేవారిమని, అయితే గడచిన 20 ఏళ్లుగా తాళం వేసి వినియోగించకుండా వదిలేశారన్నారు. ప్రస్తుతం ఈ భవ నాన్ని యార్డ్ సంస్థ ప్రతినిధులు విక్రయించేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఈ భవనాన్ని తమకు అప్పగిస్తే బాగు చేసుకుని సమావేశాలకు వినియోగించుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీవో ఉషశ్రీ, తహసీల్దార్ ప్రసాదరావు, వెలుగు ఏపీఎం గోరు రాజారావు, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అమ్మవారికి పూజలు

అరసవల్లి: జ్యేష్ట శుద్ధ పౌర్ణమిని సందర్భంగా అరసవల్లి రోడ్డులోని రమ్య తిరుమల ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కరి రంగనాథ వేణు మాధవాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం చేపట్టారు. భక్తులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

జి.సిగడాం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వరి విత్తనాలను శనివారం ఆర్బీకేల పరిధిలో రైతులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు నాయకులు కోరారు. పెంట, అనందపురం, టీడీ వలస, నడిమివలస తదితర గ్రామాల్లో విత్తన పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వజ్జపర్తి రఘురాం, చిత్తిరి మోహన్‌రావు, చిత్తిరి లక్షుం, మీసాల రమణారావు, కంచరాన సూరన్నాయుడు, మక్క సత్యసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

● **పొందూరు:** గతప్రభుత్వంలో వరి విత్తనాల పంపిణీలో రైతులు ఎదుర్కొన్న సమస్యలు రాకుండా రైతులకు టీడీపీ ప్రభుత్వం రైతులందరికీ విత్తనాలు అందించడమే ముందుకు వెళుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆర్బీకే-2 పరిధిలో విత్తనాలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎ.చినరంగ, నాయకులు బలగ శంకర భాస్కర్, బాడాన గిరి, ఎ.వాణి, ఎ.విజయలక్ష్మి, కె.శ్రీనివాసరావు, డి.రవికుమార్, ఎం.శ్రీనివాసరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస: డిగ్రీలో ప్రవేశానికి 2024-25 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆమదాలవలస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్ స్వామి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో బీకాం కంప్యూటర్స్, బీఏ హిస్టరీ (మేజర్), బీఏ రాజనీతి శాస్త్రం (మేజర్)తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

● ఒలింపిక్ డే రన్‌లో డీఈవో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం స్పోర్ట్స్: ప్రతి వ్యక్తికి మానసిక ఉల్లాసానికి వ్యాయామం చేయాలని, విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో ఒలింపిక్ డే రన్‌లో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యమూ మానసిక ఒత్తిడితో సతమతమవుతున్న ప్రతి ఒక్కరికీ రోజుకో గంట వ్యాయామం చేయాల్సి ఉంటుందన్నారు. తద్వారా రోజంతా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందన్నారు. విద్యార్థులు కూడా నిత్యమూ చదువు అని కాకుండా పాఠశాలలో మైదానానికి వెళ్లి ఏదో ఒక క్రీడలో తర్ఫీదు తీసుకోవాలన్నారు. అంతకుముందు పాత బస్టాండ్‌లో గల పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద ఒలింపిక్ డే రన్‌ను డీఈవో ప్రారంభించారు. ఈ ర్యాలీ పాతబస్టాండ్, ఏడు రోడ్ల కూడలి, పాలకొండ రోడ్, డే అండ్ నైట్, అంబేడ్కర్ జంక్షన్ రోడ్డు మీదుగా స్టేడియంకు చేరుకుంది. ఈ ర్యాలీలో డీఈవోతోపాటు జిల్లా ఒలింపిక్ సంఘ ఉపాధ్యక్షుడు చిట్టి నాగభూషణరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ముఖ్య సలహాదారుడు పి.సుందరరావు, అధ్యక్షుడు ఎంవీ రమణ, వై.పోలినాయుడు, బీవీ రమణ, శ్రీనివాసరావు, శిక్షకులు, క్రీడాకారులు, ఔత్సాహికులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాజ్యోతితో ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న డీఈవో వెంకటేశ్వరరావు

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఎచ్చెర్ల: కుప్పిలి గ్రామంలో సిరిమాను సంబరంలో జరిగిన అపశ్రుతిలో మృతి చెందిన వారి కుటుంబాలను నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్ శనివారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో బుడగట్లపాలెం గ్రామానికి చెందిన సూరాడ అప్పన్న, కారి పల్లేటి మృతి చెందగా, వీరి కుటుంబాలకు రూ.5 వేలు వంతున సాయం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో చర్చించి ఈ రెండు కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు బస్వా గోవింద్, రాజశేఖర్, రామారావు, సురేష్ పాల్గొన్నారు.

ఓఎస్‌డీ సేవలు అభినందనీయం

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఓఎస్‌డీగా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు సేవలు శ్లాఘనీయమని క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఏయూలో ఆచార్యునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన సుధాకర్‌బాబు ఆర్జీయూకేటీలో 2019 నుంచి సేవలందిస్తున్నారని చెప్పారు. ఓఎస్‌డీ విధుల నుంచి రిలీవ్ అయిన సుధాకర్‌బాబును ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ కె.మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

జి.సిగడాం: ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు శనివారం కనకదర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. పెంట గ్రామంలో గల ఆలయ ప్రాంగణంలో హోమాన్ని నిర్వ హించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నా ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వినోత, సాంస్కృతిక జానపద కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ ధర్మకర్త డోల రామారావు తెలిపారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి

లావేరు: ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని డ్వామా పీడీ చిట్టిరాజు అన్నారు. శనివారం మండలం పెదకొత్తపల్లిలో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన ఆకస్మికంగా తనికీలు చేపట్టారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్న రైతులకు అవసరమైన సాగునీటి కాలువ పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే మొక్కలు పెంపకం, ఎవెన్యూ ప్లాంటేషన్ వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

మంత్రులను కలిసిన టీడీపీ నాయకులు


కేంద్ర మంత్రి, విజయనగరం ఎంపీతో టీడీపీ నాయకులు


అచ్చెన్నాయుడితో మండల టీడీపీ నాయకులు

గార: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తోపాటు విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడును గార మండల టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ మేరకు శనివారం విజయవాడలో మండలానికి చెందిన పొట్నూరు కృష్ణమూర్తి తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

ఐటీఐలో 98 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ కొనసాగుతుంది. శనివారం 432 మంది 211 మంది హాజరై 98 మంది వివిధ ఐటీఐల్లో ప్రవేశాలు పొందారు. శనివారం 164 మంది కౌన్సెలింగ్‌కు హాజరుకావల్సి ఉంది. జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎస్.సుధ, జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు పర్యవేక్షణలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

బాడానకు అరుదైన గౌరవం

శ్రీకాకుళం కల్చరల్: విద్యా, సామాజిక, రాజకీయ వేత్త డాక్టర్ బాడాన దేవభూషణరావు వరల్డ్ బుక్ రికార్డుకు ఎంపికయ్యారు. ఆయా రంగాల్లో ఆయన అందించిన సేవకులకు గాను ఈ అవార్డును సంస్థ అధ్యక్షుడు జెన్నీఫర్ ఆన్‌లైన్‌లో అందచేశారు. సర్టిఫికెట్‌ను పోస్టులో పంపించినట్టు బాడాన తెలిపారు. ఈ అవార్డును జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధారాణి చేతుల మీదుగా తీసుకున్నారు. ఈ అవార్డు రావడంపై లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ లయన్ నటుకుల మోహన్, అధ్యక్షుడు లయన్ పొన్నాడ రవికుమార్, కార్యదర్శి టిక్కం రామ్‌గోపాల్, కోశాధికారి శిల్లా మణి, భారతి, ఆంజనేయులు, యోగా రామారావు, మురళి తదితరులు అభినందనలు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గార: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. చాలా చోట్ల వీధి కాలువల్లో పూడిక, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో జేసీబీతో వాటిని తొలగిస్తున్నారు.

కొత్త చట్టాలు అమలు చేయొద్దు

ఆమదాలవలస: వచ్చే నెల 1నుంచి అమల్లోకి రానున్న కొత్త నేర చట్టాల అమలును ఆపాలని ఆల్ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐలు) రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న భారతీయ శిక్షాస్మృతి 1860, భారతీయ సాక్ష్యాధారాల చట్టం 1872, భారతీయ నేర విధాన స్మృతి 1973 రద్దు కానున్నాయని, వాటి స్థానంలో భారతీయ నాగారిక్ సురక్షిత సంహిత 2023, భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ సాక్ష్య అదినియం 2023 అనే మూడు కొత్త నేర చట్టాలు జూలై 1 నుంచి అమలులోకి రానున్నాయన్నారు. ఈ కొత్త చట్టాల్లోని పలు నిబంధనలు రాజ్యాంగ బద్దతపై అనే రకాల న్యాయ సంశయాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ చట్టాలపై న్యాయమూర్తులు, న్యాయవాదులు, నేర పరిశోధన సంస్థలు, న్యాయనిపుణులు సమగ్రంగా అధ్యయనం చేయాలని కోరారు.

బడిఈడు పిల్లల్ని బడుల్లో చేర్పించండి



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు

కంచిలి: బడిఈడు పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈవో-1 శివరాం ప్రసాద్ అన్నారు. శనివారం పెద్ద శ్రీరాంపురం గ్రామంలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లల్ని బడుల్లో చేర్పించే బాధ్యత ప్రతీ ఒక్కరూ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన పిల్లలక ప్రభుత్వ అనేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అనంతరం ఎంపీయూపీఎస్ జెబెల్లుపడ పాఠశాలలో హెచ్ఎం కోటేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఆర్ఎంటీ ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లోనే ఉండాలి

హిరమండలం: బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. 'నేను బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా శనివారం హిరమండలం-2 పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాల లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు.

శివరాంపురంలో పారిశుధ్య పనులు

నందిగాం: శివరాంపురం గ్రామంలో ప్రత్యేక పారిశు ధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం సర్పంచ్ సబ్బి జానకిరాం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామకార్యదర్శి జానకమ్మ పర్యవేక్షణలో నీటి వనరుల్లో క్లోరి నేషన్ చేపట్టారు. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బం ది, జనసేన మండల అధ్యక్షుడు చిరంజీవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పిల్లలను చేర్చండి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఇచ్ఛాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని కార్యకర్తలు అన్నారు. మన అంగన్‌వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమంలో భాగంగా శనివారం భవానీపురం పరిధిలో ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లపైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



సోంపేట: పట్టణంలోని మహర్షి విద్యానికేతన్ వీధిలో వెలసిన విజయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాదాన్ని సమకూర్చారు.

ఘనంగా కబీర్‌దాస్ జయంతి



విద్యార్థులకు హిందీ పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

సోంపేట: ప్రముఖ హిందీకవి రాజస్థానీ, భోజపురి భాషల్లో గ్రంథాలు రాసిన కబీర్‌దాస్ జయంతి బూరగాం ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోలాటంలో ప్రతిభ



కోలాటంలో పాల్గొన్న నృత్యకారులు

సోంపేట: సింహాచలంలో శుక్రవారం జేష్ఠ పౌర్ణమి సంద ర్భంగా నిర్వహించిన కోలా టంలో జింకిభద్ర గ్రామానికి చెందిన నృత్యకారులు ప్రతిభ కనబరిచారు. కోలాటం మాస్టా రు రేయి శేషగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యంలో చిన్నా రుల ప్రతిభను పలువురు ప్రశంసించారు.


ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: పట్టణ శివారులో ఉన్న వల్లభరాయ స్మశాన వాటిక వద్ద గ్యాస్ సంహిత శవ దహన యంత్రం ఏర్పాటు చేయటానికి ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తున్నట్టు రొటేరియన్ డాక్టర్ దక్కత త్రినాథ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక రోటరీ ఫంక్షన్ హాల్‌లో డాక్టర్ అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ వేదవ్యాస్ అధ్యక్షతన ఏర్పాటు చేయబోయే గ్యాస్ సంహిత శవ దహన యంత్రం ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని తెలిపారు. వచ్చే నెలలో పట్టణంలో గల వార్డుల ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి రోహిత్, రొటేరియన్స్ పాక తులసీదాస్‌రెడ్డి, ఎస్.ప్రదీప్, గోపి చౌదరి, నవీన్‌కుమార్, రామారావు, టీడీపీ నాయకులు కాళ్ల దర్మారావు, కాళ్ల జయదేవ్, ఎస్ఎన్ పండా తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు



మంత్రితో టీడీపీ నాయకులు

ఇచ్ఛాపురం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లను టీడీపీ పట్టణ నాయకులు కౌన్సిలర్ కాళ్ల దిలీప్, రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీ యాదవ్, మాజీ జడ్పీటీసీ బెందాళం రమేష్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సంద ర్భంగా పుష్పగుచ్ఛాలను అందించి అభినందనలు తెలిపారు.

బైపాస్ మీదుగా..

- కంచిలి గ్రామంలోనికి రాని బస్సులు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

(కంచిలి)

రహదారి సౌకర్యం ఉన్న ప్రతీ గ్రామానికి ఆర్టీసీ సర్వీసులు నడుపుతామని చెప్పే అధికారులు, పాలకులు ఒకవైపు, ప్రయాణికులు కనిపిస్తే పోటీపడి మరీ బస్సులు ఆపే ప్రైవేటు బస్సు సర్వీసులు మరోవైపు... ఇన్ని సేవలు అందుబాటులో ఉన్నా కంచిలి గ్రామ ప్రజలకు మాత్రం ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. ఉద్దానం ప్రాంత ప్రజలంతా ఆధారపడిన రైల్వే స్టేషన్ కంచిలి మండల కేంద్రంలో ఉన్నా సమీప గ్రామాల నుంచి వచ్చే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు గానీ, ప్రైవేటు బస్సులు అధిక శాతం కంచిలి బైపాస్ మీదుగా మళ్లిస్తుండటంతో కంచిలివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

కంచిలి మండల కేంద్రం నుంచి వైద్య సేవల కోసం, విద్యాభ్యాసం కోసం నిత్యం అటు విశాఖ, ఇటు బరంపురం వందలాది మంది వెళ్లి వస్తుంటారు. అయితే సోంపేట నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్లే బస్సులు, ఇటు బరంపురం నుంచి విశాఖ వైపు వెళ్లే బస్సులు కంచిలి గ్రామంలోకి రాకుండా జాతీయ రహదారి (బైపాస్) మీదుగా వెళతుండడంతో కంచిలివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బరంపురం నుంచి పర్లాకిమిడి వెళ్లే బస్సులు సైతం బైపాస్ మీదుగా వెళతుండటంతో ఒడిశా వెళ్లాలంటే స్థానికులంతా కుటుంబాలతో సామాన్లు పట్టుకుని, జాతీయ రహదారిపై కాపలా కాయాల్సి వస్తుంది. కంచిలి గ్రామంలోకి బస్సులు రాకపోవడంతో సుదూరం వెళ్లే వారు తప్పనిసరిగా అటు సోంపేట గానీ, ఇటు ఇచ్ఛాపురం గానీ వెళ్లాల్సి వస్తుంది. దీంతో ఆటోలపై ఆధారపడుతున్నారు. దీనివల్ల సామాన్యులపై మరింత భారం పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంచిలి గ్రామంలోనికి బస్సులు తిరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు

కంచిలి గ్రామంలోనికి బస్సులు రావడం లేదని, బైపాస్‌లో వెళ్లడం వల్ల ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానిక ప్రజా ప్రతినిధులతోపాటు పలు సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు పోలీసులు జోక్యంతో కొద్ది రోజులు ఊర్లోకి బస్సులు రావడం, తరువాత యథావిధిగా బైపాస్‌లో వెళ్లిపోవడం జరుగుతోందని పలువురు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రూట్‌లో తిరిగే బస్సులన్నింటికీ కంచిలి స్టాపేజ్ ఉందని, అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందంటూ వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.



కంచిలి బైపాస్ మీదుగా వెళ్లిపోతున్న ఓ ప్రైవేట్ బస్సు

ఇబ్బంది తప్పడం లేదు



బైపాస్ రోడ్డు నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వెళ్లిపోతుండడంతో ఈ ప్రాంతవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడేవారి కష్టాలు వర్ణణాతీతం. వైద్యం కోసం విశాఖ వెళ్లాలంటే జాతీయ రహదారికు చేరుకు బస్సుల కోసం ఎండలోనే వేచి చూడాల్సిన దుస్థితి. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలి.

- మధు, విద్యార్థి, కంచిలి

కళాశాలకు వెళ్లాలన్నా..



మారుమూల గ్రామాల నుంచి చదువు కోసం మండల కేంద్రం కంచిలికి చేరుకోవాలంటే ఇబ్బందిపడాల్సి వస్తుంది. బస్సులు కంచిలి హైవే మీదుగా వెళ్లిపోతుండడంతో ఆటోలపై ఆధారపడాల్సివస్తుంది. దీంతో సకాలంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి బస్సులు ఊర్లో నుంచి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- ఉమా, జెన్నాఘయి గ్రామం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఈబీ ఎస్ఐ గణేష్

మెళియాపుట్టి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి ఎస్ఈబీ ఎస్ఐ గణేష్ తెలిపారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లోని యువత సారాకు అలవావడం వల్ల అనారోగ్యాలకు గురై మృతి చెందడం జరుగుతోందన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు బానివడం వల్ల తగాదాల్లోనూ ఇరుక్కుంటున్నారని, అందువల్ల వీటిని నివారించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో రమణ

మెళియాపుట్టి: చెత్తనుంచి సంపద సృష్టించడం ద్వారా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో ఐవీ రమణ తెలిపారు. శనివారం పెద్ద పద్మాపురంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానిక నేతలు సహకారం అందించాలన్నారు. వర్షాలు పడే నాటికి కాలువల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ తారకేశ్వరి, కార్యదర్శి అప్పారావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన సెంటర్ లైటింగ్ పనులు



టెక్కలిలో సెంటర్‌లైటింగ్‌ను బాగు చేస్తున్న దృశ్యం

టెక్కలి: డివిజన్, నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో సెంటర్ లైటింగ్ పనులను సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. గతంలో టీడీపీ హయాం లో సెంటర్ లైటింగ్‌తో పాటు డివైడర్లలో మొక్కలను నాటించి నిర్వహించడంలో మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు కృషి చేశారు. అయితే ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సెంటర్ లైటింగ్ నిర్వహణ, మొక్కల పెంపకంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిం చడంతో పట్టణంలో చీకట్లు కమ్ముకున్నాయి. ప్రస్తుతం మరలా ప్రభుత్వం మారి అచ్చెన్నాయుడు తిరిగి మంత్రి పదవి చేపట్టడంతో పాటు తక్షణం తగు చర్యలు తీసుకోవాలని అధి కారులకు ఆదేశించడంతో సంబంధిత సిబ్బంది పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతు న్నారు. గడచిన వారం రోజులుగా క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకుని వాటిని సరిదిద్దే పనిలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. సుమారు రూ.20లక్షలతో ఈ పనులను చేయిస్తున్నారు.

సబ్సిడీపై వలలు, తెప్పలు అందించాలి



ఎఫ్‌డీవోకు వినతిపత్రం అందిస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

సంతబొమ్మాళి: మరువాడ, గెద్దలపాడు, ఎం.సున్నాపల్లి పంచాయతీలోని మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, తెప్పలు అందించాలని టీడీపీ మత్స్యకార నాయకులు సురాడ ధనరాజ్, శ్రీరంగంరాజు కోరారు. శనివారం టెక్కలిలో మత్స్యశాఖ ఏడీకి వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ పాలనలో నిజమైన మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు అందలేదన్నారు. గతంలో అనేక పర్యాయాలు వినతులిచ్చినా మత్స్యశాఖాధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి అర్హులైన మత్స్యకారుల సంక్షేమానికి పాటుపడాలని కోరారు.

ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సూరిబాబు



రెడ్డి సూరిబాబు

సంతబొమ్మాళి: ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని సవరపేటకు చెందిన ఉపాధ్యాయుడు రెడ్డి సూరిబాబు ఎన్నికయ్యారు. శుక్రవారం విజయవాడలో సంఘ ఎన్ని కలు నిర్వహించారు. పాత పెన్షన్ పునరుద్ధరించేందుకు తనవంతు పోరాటం చేయడంతో పా టు గత ప్రభుత్వం సీపీఎస్ ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకురావాలి



ఎన్ఆర్ఐ నారీభేరీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస: ఉద్దానం ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించేందుకు ఎన్ఆర్ఐలు ముందుకు రావాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి విజయవాడలోని ఓ హోటల్‌లో ఎన్ఆర్ఐ మహిళా వింగ్ ఆధ్వర్యంలో నారీభేరి కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఆర్ ఐలు గ్రామాలను దత్తత తీసుకుని మహిళల ఉపాధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భం గా ఆమెను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ఎన్ఆర్ఐలు పాల్గొన్నారు.

ముమ్మరంగా విత్తనాల పంపిణీ



పల్లిసారధిలో విత్తనాల పంపిణీ పాల్గొన్న టీడీపీ నాయకులు

వజ్రపుకొత్తూరు: మండలంలో పల్లిసారధి, బెండి, అనంతగిరి, గుల్లలపాడు పంచాయతీల్లో శనివారం విత్తనాలను వ్యవసాయాధికారులు, టీడీపీ నాయకుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ... సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో రైతు లందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తామాడ విశ్వనాథం, ఉప్పరపల్లి తిరుపతిరావు, పోతనపల్లి షన్ముఖరావు, కణితి సురేష్, దువ్వాడ హేంబాబు చౌదరి తదితరులు పాల్గొన్నారు. అలాగే వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ కార్యాయంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అర్సవెల్లి ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రకో ఆప్షన్ మాజీ సభ్యుడు నెయ్యిల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

27న గురుపూజోత్సవం

వజ్రపుకొత్తూరు: బెండికొండ శ్రీ జ్ఞాన బోధానంద ఆ శ్రమంలో ఈనెల 27వ తేదీన గురు పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు శనివారం తెలి పారు. ఆ రోజు ఉదయం ఓంకారం, పతాకావిష్కరణ, శ్రీమద్భగవద్గీత పారాయణం, ఆధ్యాత్మికవేత్తలతో ప్రవచ నాలు ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం అన్న సమా రాధన ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

27న భవానీ త్రిశతి గ్రంథావిష్కరణ

పలాసరూరల్/హరిపురం: జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మందస మండలం మఖరజోల గ్రామ రామలింగేశ్వరాలయంలో ఈనెల 27న శ్రీభవానీ త్రిశతి గ్రంథావిష్కరణ చేపట్టనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.వెంకటాచలం, మన్మథరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పూడికలు తొలగించాలి

టెక్కలి: టెక్కలి మండలంలో 48ఆర్, 49ఆర్ కాలు వల్లో పూడికలు తొలగించి ఆయకట్టు భూములకు సాగు నీరందించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె.మోహ నరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కా ర్యాలయంలో ఆ ప్రాంత రైతులతో సమావేశం నిర్వహించారు. కాలువల షట్టర్లు మరమ్మత్తు చేసి సాగునీరం దించాలని, రైతులకు విత్తనాలతో పాటు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. సంఘ నేతలు బొడ్డేపల్లి మల్లయ్య, బగాది వాసుదేవరావు, ధనుంజయ రావు, బాలాజీ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పలాసరూరల్: పలాస మండల సాధారణ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

25న పాతపట్నంలో..

పాతపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 25న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.రామకృష్ణరాజు తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి సభ్యులతో పాటు అధికారులు హాజరు కావాలన్నారు.

నేడు హరిపురంలో విద్యాసదస్సు

హరిపురం: హరిపురం హైస్కూల్ ఆవరణలో ఆదివారం 'విద్యారంగం-కొత్తప్రభుత్వం- కొత్త ఆశలు' అంశంపై విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ (257) మండల అధ్యక్షుడు ఎస్. కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ విద్యాసదస్సులో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాను మూర్తి తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఎన్. కరుణాకర్, జి.భీమారావు, తాతారావు, రామారావు, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

హరిపురం: మందస మండలం రాధాకృష్ణాపురం బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశా లలో 2024-25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9 తరగతులకు గాను ఎస్సీ కేటగిరి, 6, 7 తరగతులకు ఎస్సీ, బీసీ, ఓసీ కేటగిరీల విద్యార్థులు ఈ నెల 26 లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 29న పాఠశాలలో నిర్వహించు పరీక్షకు హాజరుకావాలని, మెరిట్ ప్రాతిపదికన సీట్ల భర్తీ ఉంటుందన్నారు.

మండలానికి పాఠ్యపుస్తకాలు


నందిగాం: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలకు పెండింగ్ పాఠ్యపుస్త కాలు మండలానికి చేరాయి. శనివారం స్థానిక మండల స్టాక్‌పాయింట్‌కు 2,152 పుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో జి.నర్సింహులు తెలిపారు. నాలుగో తరగతి ఈవీఎస్, ఐదో తరగతి తెలుగు, గణితం, వర్క్‌బుక్‌లతో పాటు ఏడో తరగతి హిందీ, సోషల్ వచ్చాయన్నారు. వీటిని ఆయా పాఠశాలలకు అందిస్తామని పేర్కొన్నారు.

సాగు నీరందించేందుకు కృషి

సంతబొమ్మాళి: ఖరీఫ్ సీజన్‌లో శివారు భూములకు సాగునీరందించేందుకు కృషి చేస్తు న్నామని పీఏసీఎస్ మాజీ చైర్మన్ అట్టాడ రాంప్రసాద్ అన్నారు. శనివారం మర్రిపాడులో విలేక రులతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా నౌపడ, మర్రిపాడు ప్రాంతాలకు సాగునీరు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సాగునీటి సమస్యపై రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నా యుడు దృష్టికి తీసుకువెళ్లామని, ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని హామీ ఇచ్చారన్నారు. త్వరలోనే కాలువల్లో పూడికలు తీసే పనులు ప్రారంభమవుతాయన్నారు.



మందస: జగన్నాథస్వామి దేవస్నానం



పాతపట్నం: జగన్నాథునికి దేవస్నానం చేస్తున్న అర్చకులు, భక్తులు

ఘనంగా జగన్నాథునికి దేవస్నానం

జిల్లాలోని పలు గ్రామాల్లో జగన్నాథ స్వామికి దేవస్నానం శనివారం నిర్వహించారు. జగన్నాథుని విగ్రహానికి నారికేళ జలాలతో అభిషేకం చేసి తులసి, పుష్పాల మాలలతో అలం కరించి ప్రత్యేక పూజలు చేశారు. తీవ్ర అస్వస్థతకు గురైన జగన్నాథుడు 14 రోజుల పాటు చీకటి మందిరంలో ఉండి జగన్నాథ రథయాత్ర రోజున భక్తులకు దర్శనమివ్వడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నారికేళ, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాల అర్చకులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



పలాస: సీతారామాలయంలో దేవస్నానం చేయిస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం: స్వామివారికి జేష్ఠాభిషేకాలు చేస్తున్న దృశ్యం



కంచిలి: స్వామివారి వార్షిక స్నానం